5

# జన్మ రహస్యం

అనగా అనగా సత్యపాలుడనే మహారాజు ఉండేవాడు.

తన దేశమైన అవంతీరాజ్యాన్ని చక్కగా పరిపాలిస్తుండేవాడు. ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవడం కోసం ఆయన మారువేషాల్లో దేశం అంతా తిరుగుతుండేవాడు. ఆ రాజుగారి సేనాని పేరు విక్రముడు. అతను మంచివీరుడు. రాజుగారికి అతని మీద మంచి నమ్మకం, గౌరవం ఉండేవి.

ఒకసారి సత్యపాలమహారాజు మారువేషంలో తన దేశంలో తిరుగుతూ ఒక సత్రంలో విడిది చేశాడు. సత్రంలో సాధారణంగా దేశం నలుమూలల నుంచీ అనేకమంది వచ్చి విడిది చేస్తుంటారు. వారిలో వారు తమ ప్రాంతంలోని ముచ్చట్లు చెప్పుకుంటుంటారు. అందువల్ల వారి సంభాషణలు వింటుంటే దేశంలో జరుగుతున్న విషయాలన్నీ తెలుస్తుంటాయి. ఆ రాత్రి కొందరు బాటసారులు సత్రం బయట అరుగుమీద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. మారువేషంలోవున్న సత్యపాల మహారాజు వారి మాటలు వినసాగాడు.

"సత్యపాల మహారాజు మంచి ప్రభువే. కాని, విక్రముడి అక్రమాలు మాత్రం మితిమీరి పోతున్నాయి" అని బాటసారి అన్నాడు.

"ఏం?... ఏం జరిగింది?" అని అడిగాడు ఇంకో బాటసారి.

"విక్రముడికి ప్రజలమీద అనుమానం ఎక్కువ. ఎవరిమీద ఏ కొంచెం అనుమానంవచ్చినా వెంటనే తీసుకెళ్లి బందిఖానాలో పెట్టిస్తాడు. ఆఖరికి కుంటి, గుడ్డివాళ్ళని కూడా జాలి తలచడు" అన్నాడు మొదటి బాటసారి.

"అవును. అది నేనూ విన్నాను" అని ఒప్పుకున్నాడు రెండో బాటసారి. తర్వాత వారి సంభాషణ వేరే విషయాలమీద సాగింది.

'విక్రముడు మంచివాడేనే! మరి, ప్రజాకంటకుడుగా మారాడా?' ఈ విషయంలోని




నిజానిజాలను తెలుసుకోవాలని నిశ్చయించుకున్నాడు సత్యపాలుడు. వెంటనే తన రాజధానికి వెళ్ళిపోయాడు.

మర్నాడు సత్యపాలుడు, విక్రముని తన మందిరానికి పిలిపించాడు. అతను రాగానే "విక్రమా... ఈరోజు నేను మన బందిఖానాలు సందర్శించి అక్కడి ఖైదీల స్థితిగతులు స్వయంగా చూడాలనుకుంటున్నాను" అన్నాడు.

"చిత్తం ప్రభూ... అలాగే దయచేయండి!" అన్నాడు విక్రముడు.

విక్రముడు వెంటరాగా సత్యపాలుడు బందిఖానాలలో ప్రవేశించాడు. బాటసారులు అనుకున్నట్లు, వాటిలో నిజంగా ఎంతోమంది ఖైదీలు ఉన్నారు.

"విక్రమా... ఏమిటి ఇంతమంది ఖైదీలున్నారు? వీరంతా నేరాలు చేసినవారేనా?" అని అడిగాడు సత్యపాలుడు.

"చిత్తం ప్రభూ! వీరిలో కొందరు నేరాలు చేసినవారూ, మరికొందరు కుట్రలతోనూ, దురాలోచనలతోనూ మనదేశ శాంతి భద్రతలకు భంగం కలిగించడానికి ప్రయత్నిస్తున్నవారు" అని జవాబిచ్చాడు విక్రముడు.

"ఇది కేవలం నీ అనుమానమేనా... లేక, ఈ అనుమానాలకి ఆధారాలున్నాయా?" అని తిరిగి ప్రశ్నించాడు సత్యపాలుడు.

"మన గూఢచారుల ద్వారా అనుమానించదగిన వ్యక్తుల వివరాలు తెలుసుకొని ఆ అనుమానాలు ధృవపరచుకున్నాకనే వారిని నిర్బంధించడం జరుగుతోంది ప్రభూ..!" అని వినయంగా బదులు చెప్పాడు విక్రముడు.

ఆ ఖైదీలలో ఒక గుడ్డివాడు, మరొక కుంటివాడు కనిపించారు రాజుగారికి. వాళ్ళని చూపిస్తూ "వీరేమి నేరం చేశారు విక్రమా..?" అని అడిగారు రాజుగారు.

"వీళ్ళు నేరం చెయ్యలేదు. కాని, వీరికి కొన్ని ప్రత్యేక ప్రజ్ఞలు వున్నాయి. వాటిమూలంగా వీరిని స్వేచ్ఛగా వుంచడం మంచిది కాదని నిర్బంధించాను" అన్నాడు విక్రముడు.

"ప్రత్యేక ప్రజ్ఞలా..? ఏమిటవి?" ఆశ్చర్యంగా అడిగాడు సత్యపాలుడు.

"చిత్తం ప్రభూ... వీరిద్దరూ మనుషుల యొక్క, ఆఖరికి... జంతువుల యొక్క జన్మ రహస్యాలని కూడా చెప్పగలరు. అవసరమనుకుంటే మీరు పరీక్షించవచ్చు" అన్నాడు విక్రముడు.

సత్యపాలుడు గుడ్డివాడిని పరీక్షించాలనుకున్నాడు.

వెంటనే తన అశ్వశాల నుండి ఒక చక్కని గుర్రాన్ని అక్కడికి తెప్పించాడు. గుడ్డివాడితో "ఓయీ... నీ ముందున్న జంతువు ఏమిటో, అది ఏ జాతిదో చెప్పగలవా?" అని అడిగాడు.

గుడ్డివాడు "చిత్తం ప్రభూ, ప్రయత్నిస్తాను" అని ఆ గుర్రం శరీరం అంతా చేతితో నిమిరాడు.

"ప్రభూ! ఇది పుట్టుకచేత మంచి జాతి గుర్రం. కాని, ఇది గాడిదపాలు తాగి పెరిగింది" అన్నాడు గుడ్డివాడు.

రాజుగారికి, విక్రముడికీ కూడా చాలా ఆశ్చర్యం వేసింది.

వెంటనే అశ్వపాలకుడిని అక్కడికి రప్పించారు.

అశ్వపాలకుడు రాగానే రాజుగారు "ఓయీ..! ఈ గుర్రం జాతిగుర్రమేనా?" అని అడిగారు.

"చిత్తం ప్రభూ... జాతిగుర్రానికి పుట్టినదే!" అని నమ్రతతో సమాధానం ఇచ్చాడు అశ్వపాలుడు.

"పుట్టడం సరే..! పెరగడం ఎలా పెరిగింది? తల్లిపాలతోనే పెరిగిందా? నిజం చెప్పు?" అని గద్దించాడు రాజుగారు.

"చెప్తాను ప్రభూ.., ఈ గుర్రం పుట్టగానే తల్లి చనిపోయింది. పాలిచ్చే గుర్రాలు వేరే లేనందువల్ల, దీనిని గాడిదపాలతో పెంచాను" అన్నాడు అశ్వపాలకుడు భయంగా.

రాజుగారు చాలా ఆశ్చర్యపోయారు.

అశ్వపాలకునితో "సరే, నువ్వికవెళ్లవచ్చు" అన్నారు.

అశ్వపాలకుడు వెళ్లిపోగానే "ఓయీ, నువ్వసలే గుడ్డివాడివి. దీనిని చూసే అవకాశమే లేదు. మరి దీని జన్మరహస్యాన్ని ఎలా చెప్పగలిగావు?" అని గుడ్డివాడిని అడిగాడు సత్యపాలుడు.

"ప్రభూ! దీని శరీరాన్ని తడమడంవల్ల ఇది పుట్టుకచేత జాతిగుర్రమని తెలుసుకున్నాను. కాని, అసలైన జాతిగుర్రానికి వీపుమీద చేయిపడగానే చక్కిలిగింత కలిగి, గగుర్పాటుతో దాని చర్మం కదులుతుంది. దీనిలో అటువంటి చలనమే లేదు. పైగా...మీద చేయి వేయగానే, వెనక కాలితో గాడిదలాగా తన్నడానికి ప్రయత్నిస్తోంది. అందువల్ల ఇది గాడిదపాలు త్రాగి పెరిగిందని గ్రహించాను" అన్నాడు గుడ్డివాడు.

గుడ్డివాడి తెలివితేటలకి, ప్రజ్ఞకి ఎంతో సంతోషించారు రాజుగారు. వెంటనే బందిఖానా అధికారితో "ఈ రోజు నుంచీ ఈ గుడ్డివానికి పెట్టే తిండిని రెట్టింపు చేయండి. రోజూ రెండు రొట్టెలు ఇస్తుంటే ఇంక ముందు నాలుగు ఇవ్వండి. అలాగే అన్ని పదార్థాలనూ..!" అని ఆజ్ఞ జారీ చేశాడు.

తర్వాత రాజుగారు కుంటివాడిని పరీక్షించాలనుకున్నాడు.

"ఓయీ, కుంటివాడా... నీ ప్రజ్ఞ ఏమిటి? మనిషిని చూసి అతని జన్మరహస్యం చెప్పగలవా?" అని అడిగాడు సత్యపాలుడు.

"చిత్తం ప్రభూ..!" అన్నాడు కుంటివాడు వినయంగా.

"అయితే.., నాకు ఏదైనా జన్మరహస్యం వుందంటావా?" అని సరదాగా అడిగాడు సత్యపాలుడు. 'తనకి జన్మరహస్యం ఏముంటుందిలే, కాసేపు కుంటి వాడిని ఆట పట్టించవచ్చు..!' అనుకున్నాడు.

"చిత్తం ప్రభూ..!" అన్నాడు కుంటివాడు.

ఆ సమాధానం విని ఆశ్చర్యపోయాడు రాజు. విక్రముడు ఉలిక్కిపడ్డాడు.

"ఏమిటి నువ్వంటున్నది? నాకు జన్మరహస్యం ఉందా? నువ్వేమంటున్నదీ తెలిసే మాట్లాడుతున్నావా?" అని పట్టరాని కోపంతో అడిగాడు రాజుగారు.

"చిత్తం ప్రభూ..!మీరు అడిగారు కనుక చెప్పాను. నిజం మాట్లాడవద్దంటే మానేస్తాను" అన్నాడు కుంటివాడు.

"అయితే... అదేమిటో చెప్పు?" గద్దించాడు సత్యపాలుడు.

"చెప్తాను ప్రభూ- కాని, మీరు ఒంటరిగా ఉన్నప్పుడే చెప్పగలను."

సత్యపాలుడు విక్రముడినీ, మిగిలినవారినీ అక్కడనుంచి వెళ్లమని ఆజ్ఞాపించాడు. వాళ్ళు వెళ్లిపోయాక "ఇప్పుడు చెప్పు..!" అన్నాడు కోపంగా.

"ప్రభూ.... తప్పక చెప్తాను. కాని, తమరు నాకో మాటివ్వాలి!"

"ఏమిటది..?"

"నేను చెప్పినది విన్నాక మీకు తగని కోపంరావచ్చు. అయినా దానిని నిగ్రహించుకొని నా ప్రాణాన్ని రక్షిస్తానని ప్రభువులు మాట ఇవ్వాలి."

"అలాగే..! నువ్వు చెప్పింది నిజమైతే- నిన్ను రక్షించడమే కాకుండా బహుమతి కూడా ఇస్తాను. అబద్ధమైతే- నీ తల తీయించి కోట గుమ్మానికి కట్టిస్తాను" అన్నాడు సత్యపాలుడు.

"ప్రభూ...నేను ఈ విధంగా చెప్తున్నందుకు మన్నించాలి. మీరు మహారాజుకి పుట్టినవారు కాదు. మీ తండ్రి ఒక వంటవాడు!" అన్నాడు కుంటివాడు భయంభయంగా.

ఆ మాటలు విని రాజుగారు మ్రాన్పడిపోయారు.

వెంటనే తన తల్లి దగ్గరికి వెళ్లి, "అమ్మా....నేనొక విషయం అడుగుతాను. దాచకుండా నిజం చెప్తావా?" అని అడిగాడు.

"అదేమిటి బాబూ... ఏ విషయమైనా నీ దగ్గిర దాస్తానా? అడుగు...చెప్తాను" అంది.

"అలాకాదు. నామీద ప్రమాణం చేసి చెప్పు!" అన్నాడు సత్యపాలుడు.

"అలాగే..! నీమీద ప్రమాణం చేస్తున్నాను. నిజమే చెప్తాను."

"అయితే... నా తండ్రి ఎవరు? మహారాజేనా?"

"ఈ అనుమానం నీకెందుకొచ్చింది బాబూ?"

"నిజం చెప్పమ్మా. ఆ నిజం ఎంతటి భయంకరమైనదైనా భరిస్తాను."

"చెప్తాను బాబూ! నీకంటే ముందు నాకు చాలామంది బిడ్డలు పుట్టి చనిపోయారు. నీవు నా కడుపులో పెరుగుతున్నపుడే మన వంటవాడి భార్యకూడా గర్భవతి అయింది. ఒకే సమయాన మా ఇద్దరికీ మగబిడ్డలు పుట్టారు. చెలికత్తెలు మా బిడ్డలను తారుమారు చేశారు. ఈ విషయం నాకు చాలాకాలం తెలియలేదు. మామూలుగానే ఆ బిడ్డ చనిపోయాడు. మా దగ్గరున్న నీవు మాత్రం ఈ రాజ్యానికి వారసుడుగా మిగిలావు. ఈ విషయాన్ని మీ నాన్నగారికి కూడా చెప్పలేదు. నీవు మా పెంపుడు కొడుకువి మాత్రమే..!" అని అసలు రహస్యం చెప్పింది.

వెంటనే రాజుగారు ఆ కుంటివాని దగ్గరికి వెళ్లాడు. 'తన తల్లికి తప్ప ఎవరికీ తెలియని ఈ రహస్యం అతనికి ఎలా తెలిసిందా..?' అని ఆశ్చర్యపోసాగాడు. అదే విషయం అతన్ని అడిగాడు.

"ప్రభూ... మనుష్యుల ప్రవర్తనని బట్టి - నేను వారి పుట్టుకని గూర్చి చెప్పగలను. మీ విషయం ఎలా చెప్పానంటే... మీరు గుడ్డివాడి ప్రజ్ఞకి మెచ్చి, అతనికి రోజూ ఇచ్చే తిండిని రెట్టింపు చేయమన్నారు. మహారాజులకి హుందాతనం వుంటుంది. అంతటి ప్రజ్ఞని గుర్తించినప్పుడు నిజమైన మహారాజుల రక్తం వున్నవాళ్ళు, సంతోషం కొద్దీ రత్నాలహారమో, ముత్యాలహారమో, బంగారమో ఇచ్చి గౌరవిస్తారు. కాని - మీరు రొట్టెలు, తిండి పరిమాణాన్ని పెంచమన్నారు. ఇవి వంటవాని బుద్ధులు. దీనిని బట్టే మీలో రాచరక్తం లేదనీ, వంటవాని రక్తం వుందనీ గ్రహించాను" అని చెప్పాడు కుంటివాడు.

అతని సమాధానానికి రాజుగారికి కోపం రాలేదు. పైగా... సంతోషం వేసింది.

వెంటనే విక్రముడిని అక్కడికి పిలిపించాడు.

"విక్రమా... ఇంతటి ప్రజ్ఞావంతులైన వీరిద్దరినీ ఎందుకు ఖైదు చేశావు?" అని అడిగాడు.

"ప్రభూ... వీరిద్దరూ అసమాన ప్రజ్ఞావంతులు. ఎంతటి గొప్పవారి గుట్టు అయినా చిటికెలో తెలుసుకుంటారు. ఇటువంటి వారిని గూఢచారులుగా ఉపయోగించుకుని మన శత్రువులు మనకి ప్రమాదం తేవచ్చు. అందుకే వీరి సంగతి తెలుసుకుని ఖైదులో వుంచాను" అన్నాడు విక్రముడు.

"రాజ్య రక్షణ కోసం నువ్వు చేసిన పని మంచిదే..! కాని, నేను అంతకన్నా మంచి పని చేయ బోతున్నాను" అన్నాడు సత్యపాలుడు.

'అది ఏమిటా...' అని ఆశ్చర్యంగా చూస్తుండసాగాడు విక్రముడు.

సత్యపాలుడు ఆ కుంటి వాడినీ, గుడ్డివాడినీ పిలిచాడు. ఇద్దరికీ ఘనంగా ధనం ఇచ్చి సత్కరించాడు. పైగా... వారిద్దరినీ తన కొలువులో గూఢచారులుగా నియమించాడు. అయితే.., కుంటి వాడితో మాత్రం- తన జన్మ రహస్యం బయట పెట్ట వద్దనీ, పెడితే తల తీయించేస్తాననీ రహస్యంగా చెప్పాడు.

ఆ రోజు నుంచి కుంటి, గుడ్డి వాళ్ళిద్దరూ రాజుగారి కొలువులో నమ్మకంగా పనిచేస్తూ సుఖంగా జీవితం గడపసాగారు. సత్యపాలుడు కూడా మహారాజులకు వుండవలసిన మంచి లక్షణాలని అలవాటు చేసుకుని ప్రజల్ని చక్కగా పరిపాలించాడు.

★★★